# చెమ్మగిలు నయనమ్ము లేదు

ఎన్ని లక్షల సంవత్సరాల నాటి మాటో. ఆ రోజుల్లో భూమండలమంతటా మహారణ్యాలే ఉండేవట. ఈ అరణ్యాలను ఆశ్రయించుకొని, రకరకాల ప్రాణులూ బతుకుతుండేవట. ఈ ప్రాణుల్ని వేటాడి పొట్ట పోసుకొనే మృగాలు కూడా ఈ అడవుల్లోనే వుండేవట. ఈ క్రూరమృగాల నుండి తప్పుకొంటూ, సాధు జంతువుల్ని వేటాడి జీవించే మానవులూ ఈ అడవుల్లోనే ఉండేవారుట.

జంతువుల్ని వేటాడడం తగ్గించి, బతకడం కోసం భూమిమీద ఆధారపడడానికి ప్రయత్నించడం మానవేతిహాసంలో ప్రధానమైన ఘట్టం, ఒకప్పుడు అడవి జంతువుల్ని వేటాడేందుకు ఉపయోగించే రాతి కత్తులను, రాతి గొడ్డళ్లను, రాతి ఈటెలను, భూమిని తవ్వడానికుపయోగించి ఉండాలని మానవ శాస్త్రవేత్తల అభిప్రాయం. చిత్తవత్తుగా వున్న అడవలుల్లో తవ్వి, గింజలు చల్లేందుకు అనువుగా వుండే మైదాన ప్రాంతాలు చాలా తక్కువగా వుండేవి.

ఈ మైదానభూముల కోసం అనాది మానవుడు అన్వేషించాడు. ఒక చోట నుండి మరో చోటకు వలసలు వెళ్ళాడు. సమతలమైన ప్రదేశాలు లభించేవి కావు. ఒక వేళ వున్నా అంతకు ముందే చేసి, ఆ భూమి పరిసరాల్లో తనలాంటి వారెవరో ఉండేవారు. వారితో యుద్ధాలు చేసి, తాము చావడమో, ఎదటివారిని చంపడమో చేసిన సంఘటనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. మరికొందరు, యుద్ధాలదాకా పోగలిగే వారు కాదు. తమకున్న పరిమితమైన రాతి పనిముట్లతో, అడవులను శుభ్రం చేసుకొని అక్కడ విత్తులు చల్లుకొనే వారు. అనుభవం మీద తేలిందేమిటంటే యుద్ధాలకన్నా ఇదే సులువైనదని.

ఇలా వేలాది సంవత్సరాలు గడిచింది. అరణ్యాలను ఛేదించి, ఆ భూములను సేద్యానికి యోగ్యంగా చేయడానికి మనుషులు అలవాటు పడ్డారు. భుజబలం, కండబలం ఉన్నవారు అడవుల్ని ఆక్రమించుకొంటే, ఈ మనుష్యులు వెళ్ళి చెట్లను కొట్టి, మొళ్లను త్రవ్వి మెరక పల్లాలను సరిచేసి, దున్నడానికి నేలను అమరికం చేసి, ఈ శ్రమకు గాను అంతో యింతో పుచ్చుకొని, బయటపడడానికి ఈ మనుషులు అలవాటు పడ్డారు.

ఇలా అలవాటు పడిన వంశానికి చెందిన వాడే మన పాపయ్య, పాపయ్య అడవిలో పుట్టాడు. అడవిలో పెరిగాడు. అడవిలోనే పెళ్లాడాడు. అడవిలోనే బిడ్డల్ని కన్నాడు. అడవిలోనే వాళ్లను పెంచాడు. అసలు అడివిని దాటి, ఇవతలకు రావాలని పాపయ్యకు లేనేలేదు. కానీ తప్పనిసరయి వచ్చాడు.

“మా అయ్య కూడా ఈ పనే చేసేవాడండి. ఆయన గొడ్డలి తీసుకొని ఏ చెట్టు దగ్గరకొచ్చినా, ఆ చెట్టు గజగజలాడి పోయేది” అన్నాడు పాపయ్య నుదుటి మీద చెమటను తుడుచుకొంటూ.

చిన్నప్పుడు తన తండ్రితోపాటు తను కూడా అడవుల లోపలికి పోతూ వుండేవాణ్ణనీ, అడివి పందులు, ఎలుగ్గొడ్లు అప్పుడప్పుడు చిరుత పులులు కనిపించేవనీ చెప్పాడు. తనకు వాటిని చూస్తే భయం వుండేది కాదనీ చెప్పాడు. కాలు తీసి కాలు పెట్టడానికి వీలుండేది కాదన్నాడు.

“అది చెప్పడానికి కుదరదు బాబయ్యగారూ. చూడాల్సిందే. ఎటుపోదామన్నా చెట్టో పొదో, ముళ్ల డొంకో,మానో, అడ్డం వస్తుంది. పాములు కోకొల్లలు. ఎన్ని రకాల పిట్టలనీ ఎన్నిరకాల జీవాలనీ”

పాపయ్య ఆ వివరాలన్నీ చెప్పుకొచ్చాడు.

తన కుటుంబాలే ఏడెనిమిది దాకా ఉండేవిట. వీళ్లందరూ కలసి చెట్లను కొడుతూ వుండేవారట.

గుత్తదార్ దొరలు కొట్టమనేవారు. గొడ్డళ్ళు, రంపాలు, మోకులు, కొమ్మ కత్తులు, దొరలే ఇచ్చేవాళ్ళు'' అన్నాడు పాపయ్య.

అడవుల్ని కలపకోసం కాంట్రాక్టు తీసుకొన్న కంట్రాక్టర్, ఎక్కడో వుండేవాడు. ఆయన తాలూకు మనుషులు మాత్రం అడవుల్లోకి వొచ్చేవాళ్ళు. వచ్చి, ఈ కుటుంబాల వాళ్లను కలుసుకొనేవాళ్ళు. వీళ్లతో కూలినాలి మాట్లాడి అడవుల మధ్యకు 'తోలుకు' పోయేవారు. కరపొద్దు పొడుస్తున్నప్పుడు, గొడ్డళ్ళు, రంపాలు నష్టామేకులు, కొమ్మకత్తులు భుజాన వేసుకొని, అడవిలోకి పోయిన పోవడం ఇక - కనుచీకటి పడిందాకా వొచ్చేవారు కాదు. మకాంకి- కొట్టే స్థలానికి మరీ దూరమయితే మకాంను, అక్కడికి మార్చేవారు. కాస్త పల్లుడు చూసుకుని గొయ్యతీస్తే నీరు పడేది.

''ఆ రోజుల్లో కూలి, బేడా మూడణాలుండేది. ఈ డబ్బులయినా- మాకేం ఉపయోగం లేదు. ఎందుకూ పనికిరావు. అందుకని దొరకే మాకు జొన్నలు, ఉప్పు, నూనె, కారం ఇస్తుండేవారు. మధ్యాహ్నం పూట సంకటి గాని అంబలిగాని ఇస్తుండేవారు. ఇక పని అడగబాకండి, చచ్చేటంత పని, గొడ్డు చాకిరీ చేయాల్సిందే! పాలుమాలడానికి లేదండి. కూచోడానికి లేదండి. నడుం వాలిస్తే వాల్చినట్లు చూస్తే చావబాదేవారు. గుత్తేదార్ మనుషుల దగ్గర తుపాకులండేవి. చుట్టూరా కాపలా వుండేవారు. ఆ అద్దాన్నపు అడవిలో కాల్చి చంపినా అడిగేదిక్కులేదు. అడవుల ఆఫీసర్లు వుంటారనుకోండి, ఏం వుంటే ఏం లాభం లేదండి. అందరూ దొంగలే! వాళ్ళూ వీళ్ళూ కుమ్మక్కయి ఈ ఘోరమంతా చేస్తుంటారు'' అన్నాడు పాపయ్య.

ఈ కాంట్రాక్టరు క్రింద నలభయి సంవత్సరాలు పనిచేశాడు పాపయ్య, ఎన్ని వేలచెట్లు నరికాడో లెక్కలేదు. అడవి పందుల్ని గొడ్డలితోనే నరికిన సందర్భాలు చాలా వున్నాయన్నాడు. ఎంత నిటారుగా వున్న చెట్టునయినా క్షణంలో ఎక్కగలనన్నాడు. పాముల్ని, జీవాల్ని చూస్తే తనకు భయం లేదనీ, తనంటేనే వాటికి భయమని అన్నాడు. అదిలాబాదు, ఖమ్మం, నిజామాబాదు అడవులకే తన బతుకులు అర్పితం చేసిన పాపయ్య- కంట్రాక్టర్లకు లక్షలు పోగు చేసి పెట్టిన పాపయ్య - బొక్కెడుకంతలతో బయట పడ్డాడు.

''రాంరెడ్డిగారి దగ్గర అప్పుచేశా. పెద్దోణ్ని, ఆ దొరదగ్గర ఉంచా. పెద్ద పిల్లకు పెళ్ళి చేయడానికయింది అప్పు. బిడ్డలను కాల్చుకుతినేవాడండి! మీలాంటి దొర - కల్కటేరుతో చెప్పి కొడుకును విడిపించాడు. వాడిప్పుడు ఇక్కడే ఉన్నాడు. రిక్షా తొక్కుతున్నాడు.''

కొడుక్కు పిల్లలున్నారు. రిక్షా మీద వచ్చే నాలుగు పైసలు చాలవు. తనకింకా ఓపిక వుంది ఊరికే పడి తినడం తనకిష్టంలేదు. అందుకే ఇక్కడ పనిచేస్తున్నాడతను.

''నెలకింత జీతం కాదండి. రోజుకింత అని కూడా కాదు. ఇవిగో... ఈ మోడులన్నీ నాకిస్తాడు. వీటిని పేళ్లకిందా చితకులకింద పగలెయ్యాలి. ఎంత చేస్తే అంత వస్తుంది. ఎంత చచ్చుగా చూసుకున్నా రెండు రూపాయలకు తక్కువుండదు లేండి!'' అన్నాడు పాపయ్య.

తనెప్పుడు పుట్టిందీ తనకు తెలియదన్నాడు. తన తాత పేరు కూడా తనకు తెలియదన్నాడు. అడవిలో ఉన్నప్పుడు తాడికల్లు, ఈతకల్లు తాగేవాణ్ణన్నాడు. ఇప్పసారా తాగిన మాట నిజమేగానీ, చేయడం మాత్రం తెలియదన్నాడు.

ఎంత కాలం చేస్తావంటే, “ఏం చెప్పను బాబూ! ఓపికున్నంతకాలం చేస్తా. ప్రాణం పోయేదాకా చేస్తా. ఇదివరకుమల్లే ఉడాయించి గొడ్డల్ని ఎత్తలేకపోతున్నాను. ఆయాసమొస్తున్నది. రొప్పొస్తున్నది. గుండెల్లో దడదడగా ఉంటున్నది.”

ఎండ తగలకుండా చుట్టుకున్న తలగుడ్డతో ముఖం, గొంతు తుడుచుకొని భుజం మీద వేసుకున్నాడు పాపయ్య. అతనన్నట్లు - ఓపికున్నంత వరకూ, పేళ్ళు వేస్తూనే ఉంటాడు. ఎప్పుడో ఓపిక సన్నగిల్లుతుంది. గొడ్డలి బరువును ఓపలేక, కట్టెపేడులాగా నేలకు వొరిగిపోతాడు పాపం!